# స్థిరీకరణకు అవకాశం




**గత వారం:** విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు కొనసాగడంతో గత వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ మరింత జోరును కనబరచింది. వారాంతంలో సుమారు 276 పాయింట్ల లాభంతో ముగిసింది. చైనాలో వస్తూత్పత్తి గణాంకాలు ఆశించిన దాని కన్నా మెరుగ్గా రావడం, కీలకమైన నైరుతి రుతుపవనాలు క్రియాశీలం కావడం, అంతర్జాతీయ మార్కెట్లు నిలకడగా ఉండటం వంటి సానుకూల పరిణామాల మధ్య మార్కెట్ గత వారాన్ని ఆరంభించి పురోగమించింది. ఆహార ద్రవ్యోల్బణం జులై 24తో అంతమైన వారంలో 9.53 శాతానికి దిగి వచ్చింది. అంత క్రితం వారంలో ఇది 9.67 శాతం. ఇలా వరుసగా రెండు వారాలు ఆహార ద్రవ్యోల్బణం తగ్గడంతో సెన్సెక్స్ ఎగబాకి, గురువారం 18295ను తాకింది. ఇది వారంలోనే గరిష్ఠం. ఆ తరువాత వెల్లడి అయిన అమెరికా ఆర్థిక సమాచారం ఆ దేశం ఇంకా బలహీనంగానే ఉందన్న సంకేతాలు అందించడంతో లాభాల స్వీకరణ చోటు చేసుకొని, సెన్సెక్స్ శుక్రవారం 18144 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐలు, ఫండ్‌ల స్పందన:** ఎఫ్ఐఐలు నికర కొనుగోలుదారు పాత్రను పోషించాయి. అయితే ఇదివరకటితో పోలిస్తే కాస్త తక్కువగా రూ.3,491 కోట్ల మేరకు ఈక్విటీలలో పెట్టుబడులు పెట్టాయి. మరో వైపు మ్యూచువల్ ఫండ్‌లు నికర అమ్మకందారులుగా మారి, రూ.480 కోట్ల విలువైన షేర్లను విక్రయించాయి.

**సూచీల కదలికలు:** మన్నికైన వినియోగవస్తువుల సూచీ మరో వారం అధికంగా లాభపడింది. ఐటీ, స్థిరాస్తి సూచీలలో కొనుగోళ్ల హడావుడి కనిపించింది. చమురు, సహజవాయువుల సూచీ రెండో వారమూ నష్టాల బాటన నడచింది. ఆరోగ్య సంరక్షణ, లోహాల కంపెనీల షేర్లు పెద్దగా రాణించలేదు.

**మార్కెట్ విస్తృతి:** పరుగులు తీసిన, వెనుకపట్టు పట్టిన షేర్ల నిష్పత్తి 1:1గా ఉండి, మార్కెట్ విస్తృతి మిశ్రమ ధోరణిలో సాగినట్లు సూచించింది.

**ఈ వారం..:** గతవారం ఆరో ట్రెండ్‌లైన్ స్థాయి వద్ద చక్కటి మద్దతు లభించడంతో సెన్సెక్స్ అక్కడికి ఎగువనే చలించింది. ప్రస్తుతం 17800 వద్ద నిలచిన ఈ కీలకమైన స్థాయికి దిగువన ముగిసిన పక్షంలోనే సెన్సెక్స్ స్వల్ప కాల దిద్దుబాటు దశలోకి ప్రవేశించగలదని భావిస్తున్నారు. ఒకవేళ సెన్సెక్స్ ఈ స్థాయిని ఛేదిస్తే, తదుపరి బలమైన మద్దతు 17374 వద్ద లభించవచ్చు.

**ప్రభావిత అంశాలు:** మార్కెట్లు జూన్ నెల పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) తీరుతెన్నులను నిశితంగా పరిశీలించవచ్చు. మే నెలలో ఐఐపీ అంచనాల కన్నా తక్కువ వృద్ధిని చూపిన కారణంగా అది ఈసారీ తగ్గితే మార్కెట్ సెంటిమెంట్‌పై వ్యతిరేక ప్రభావం ఉండవచ్చు. ఈ నెల 10న అమెరికా ఎఫ్ఓఎంసీ సమావేశం ఫలితాలు, ఆ దేశంలో ఉద్యోగం లేనివారు ప్రభుత్వ సాయం కోసం పేర్లు నమోదు చేసుకొంటున్న తీరు, మన దేశంలో పార్లమెంట్ సమావేశాలు.. ఇటువంటి సమాచారం మార్కెట్ కదలికలను నిర్దేశించవచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18295, 18362, 18526; **తక్షణ మద్దతు స్థాయిలు:** 18000, 17911, 17800

**స్వల్ప కాతంలో మార్కెట్ పురోగమించే ముందు మరింతగా స్థిరీకరణకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయి.**

*– సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*